కళ తప్పిన జంక్షన్లు

- నిర్వహణ కరవు
- కానరాని పచ్చదనం
- తుప్పపట్టిన రైలింజిన్



నిర్వహణ కరువై తుప్పపట్టిన రైల్వేన్యూకాలనీలోని రైలింజన్



పెయింటింగ్ ఊడిపోతున్న పూలమొక్క నమూనా



ఫౌంటెన్ దిగువ భాగంగా నాచు



అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ వద్ద కూటమి జెండాలకు పరిమితమైన ఫౌంటెన్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధిలో గతంలో సుంద రీకరించిన పలు జంక్షన్లు నిర్వహణ లేమితో కళ తప్పాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నగరంలోని అనేక జంక్షన్లలో వాటర్ ఫౌంటెన్లు, అందమైన కళాఖండాలను ఏర్పాటు చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఆ రోజుల్లో ఈ జంక్షన్లు చూసిన వారు ఆగి ఫొటోలు తీసుకునేవారు. కానీ నేడు ఇవి నిర్వహణ కరువై కళావిహీనంగా మారాయి.

రైల్వే న్యూకాలనీ జంక్షన్ దుస్థితి

ముఖ్యంగా రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రైలు ఇంజన్ నమూనా, దాని చుట్టూ ఉన్న లైటింగ్, వాటర్ ఫౌంటెన్ గతంలో ఎంతో ఆకర్షణీయంగా ఉండేవి. ఇప్పుడు లైటింగ్ లేదు, ఫౌంటెన్ పనిచేయడం లేదు. రైలు ఇంజన్ దుమ్ము, ధూళితో నిండి ఉంది. పక్కనే ఉన్న పూల మొక్క నమూనా కూడా రంగు మారి, పెయింటింగ్ ఊడిపోయింది. మొత్తం మీద ఈ జంక్షన్‌ను పట్టించుకునేవారు కరువయ్యారు.

అక్కయ్యపాలెం జంక్షన్ పరిస్థితి ఇదే

అక్కయ్యపాలెం, మహారాణి పార్లర్ వద్ద జంక్షన్‌ను కూడా గతంలో సుందరంగా అభివృద్ధి చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన మంచి లైటింగ్, వాటర్ ఫౌంటెన్ ప్రస్తుతం పాడైపోయి సరిగా పనిచేయడం లేదు. ప్రజాధనం వృధా కాకుండా ఉండేందుకు జీవీఎంసీ అధికారులు ఈ జంక్షన్లకు సరైన నిర్వహణ చేపట్టాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

నిర్లక్ష్యం తగదు

ఎంతో ఖర్చుపెట్టి గత ప్రభుత్వం అభివృద్ధి పరిచిన రైల్వేన్యూకాలనీ జంక్షన్‌ను నిర్లక్ష్యంగా వదిలేయడం సరికాదు. మొదట్లో ఉన్న శ్రద్ధ నేడు జీవీఎంసీకి లేకుండా పోయింది. ఇలా ప్రజాధనం దుర్వినియోగం చేయడం సరికాదు.

–రమణ, రైల్వేన్యూకాలనీ

పూర్వవైభవం తీసుకురావాలి

రైల్వేన్యూకాలనీ జంక్షన్‌ను అభివృద్ధి చేసిన తొలి రోజుల్లో చాలామంది ఇక్కడ ఆగి ఫొటోలు తీసుకునేవాళ్లు. అంత అందంగా మా జంక్షన్‌ను అభివృద్ధి చేశారు. చక్కని రైలింజన్, పచ్చదనం, లైటింగ్, వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశారు. కానీ నేడు ఇవేమి ఇక్కడ కానరావడం లేదు.

–స్వర్ణ, రైల్వేన్యూకాలనీ

రూ.20 లక్షలతో గ్రీన్ బెల్ట్ అభివృద్ధి



గ్రీన్‌బెల్ట్ ప్రాంతం అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్రావణి

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు పరిధి పోర్టు స్టేడియం ఎదురుగా ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని రూ. 20 లక్షలతో అభివృద్ధి చెయ్యనున్నారు. 25, 24, 44 వార్డులపరిధిలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతం అభివృద్ధి చెందినప్పటికీ 26వవార్డు పరిధిలో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ సైతం ధ్వంసమైంది. దీనిపై 'గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కరువు' శీర్షికన గ్రీన్‌బెల్ట్ దుస్థితిపై ఈనెల 1న ప్రచురితమైన కథనానికి వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి స్పందించారు. గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా బుధవారం వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు. ఎన్జీజీవోస్ కాలనీ హైవేకు ఆనుకొన్ని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్, పార్కు అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే పాదచారులు సేదతీరడానికి సిమ్మెంట్ బెంచీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న అరసం ఉపాధ్యక్షుడు హనుమంతరావు

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో వర్షంపై నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వర్షంపై కవితలు చెప్పడం అభినందనీయమన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో వివిధ కవుల కవితా స్పందనలను వివరించారు. డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడుతూ కవిత్వం అనేది అనుభూతి చెంది, మనసు ద్రవించి అందమైన ఆవిష్కరణలతో ప్రజల ముందుకు వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు సీహెచ్. చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, ఎం.పరమేశ్వరరావు, కేవీఎస్ మూర్తి, కొత్తూరు రమణ, చాగంటి జోగారావు, చల్లా రాంబాబు, బి. రాధారాణి తమ స్వీయ కవితలను వినిపించారు.

శ్రీలలితాపీఠంలో గోశాల నిర్మాణం

సీతంపేట: కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి స్వామి ఆశీస్సులతో అక్కయ్యపాలెంలోని లలితానగర్‌లోని శ్రీలలితాపీఠంలో గోశాల నిర్మించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఒక ప్రకటన లో తెలిపారు. గోసంరక్షణకు అనువైన, సౌకర్యవంతమైన గోశాలను నిర్మించడానికి భక్తులు తమ శక్తి మేరకు వస్తువులు లేదా విరాళాల రూపంలో సహాయం అందించాలని ఆయన కోరారు. విరాళాలు అందించిన భక్తులకు 80జి ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9849286779 నంబర్‌ను సంప్రదించవచ్చని కృష్ణసేన్ తెలిపారు.


కనకమహాలక్ష్మికి విశేష పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మి పూజలు బుధవారం 20వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరంతో లక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట కూడా పూజలు చేసి, వారికి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపించారు. ఈ పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ కార్యనిర్వాహణాధికారిణి కె. శోభారాణి తెలిపారు.


ఉద్యోగులను సత్కరించిన డీఆర్ఎం



అవార్డులందుకున్న సిబ్బందితో డీఆర్ఎం

తాటిచెట్లపాలెం: వాల్తేరు రైల్వే డివిజన్‌లో అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులను డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రా సత్కరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో, భద్రతాపరమైన కార్యకలాపాలను విజయవంతంగా పూర్తి చేసి, రైళ్ల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూసిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఉద్యోగులు చూపిన తెగువ, నిబద్ధతలను డీఆర్ఎం కొనియాడారు. రైల్వే సిబ్బంది అంతా ఇదే స్ఫూర్తితో పనిచేస్తే ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించగలమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్లు (ఏడీఆర్ఎంలు) ఈ. శాంతారాం, మనోజ్‌కుమార్ సాహూ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం: ద్వారకానగర్‌లో గల ఐసీ ఐసీఐ బ్యాంక్ సమీపంలో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సుమారు 65 ఏళ్ల వయస్సు గల యాచకుడు మంగళవారం సాయంత్రం ఊపిరాడక పడి ఉండగా, అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం తెలిసిన వారు 63051 87009 లేదా 94409 04332 నంబర్లలో ద్వారకా పోలీసులను సంప్రదించాలని కోరారు.

సెయింట్ జోసెఫ్‌లో 'హ్యాండ్లూమ్ డే'



చేనేత దినోత్సవంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో ఉన్న సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం హ్యాండ్లూమ్ ఎక్స్‌పో–చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ మాట్లాడుతూ మన సంస్కృతి, వస్త్ర వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ వేడుకలు చేనేత కళను ప్రోత్సహించడానికి, సంరక్షించడానికి దోహదపడతాయన్నారు. సంప్రదాయ చేనేత కళను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో 'కాస్ట్యూమ్స్ ఆఫ్ ఇండియా', 'వింటేజ్ బ్లాక్ ప్రింటింగ్', దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాడ లేని కంది పప్పు

- బియ్యం, పంచదార మినహా ఇతర సరకులు శూన్యం
- కంది పప్పు కోసం ఎదురు చూపులు



మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, రేషన్ దుకాణాల్లో కంది పప్పు సరఫరా సరిగా జరగడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిరంతరం కందిపప్పు పంపిణీ జరిగేదని, అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని నెలల్లో మాత్రమే కందిపప్పు ఇచ్చిందని, అది కూడా పూర్తిగా కాకుండా అరకొరగా ఇచ్చిందని కార్డుదారులు వాపోతున్నారు. ప్రతి నెలా కంది పప్పు ఎప్పుడు ఇస్తారని రేషన్ డీలర్లను అడుగుతుండగా, సరైన సమాధానం చెప్పలేక డీలర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక రకాల నిత్యావసరాలు ఇస్తామని హామీ ఇచ్చినా, ప్రస్తుతం కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,12,619 తెలుపు రేషన్ కార్డులు, 625 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. జిల్లాలోని మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ వంటి ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గతంలో కిలో కంది పప్పును రూ. 70 చొప్పున పంపిణీ చేసేవారని, ఆ విధానం ఇప్పుడు కనుమరుగైందని ప్రజలు చెబుతున్నారు. కందిపప్పు, రాగి పిండి, వంటనూనె వంటి నిత్యావసరాలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం అరకొర సరుకులతో సరిపెడుతున్నారని ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు.

మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ 'హిచ్‌కాక్'



హిచ్‌కాక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: ప్రపంచ ప్రఖ్యాత సినీ దర్శకుడు ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ 126వ జయంతిని ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో విశాఖ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ కామెడీ, సస్పెన్స్, థ్రిల్లింగ్ చిత్రాలను తెరకెక్కించడంలో హిచ్‌కాక్‌కు సాటి ఎవరూ లేరని అన్నారు. కథను ఎంపిక చేసుకోవడంలో, ప్రేక్షకులను సస్పెన్స్‌లో ఉంచడంలో ఆయనకు ఉన్న నైపుణ్యం వల్ల ఆయనను 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్' అని పిలిచేవారని తెలిపారు. ఆయన చిత్రాలు నేటి తరం దర్శకులకు మార్గదర్శకమని పేర్కొన్నారు. అనంతరం 1959లో ఆయన దర్శకత్వం వహించిన 'నార్త్ బై నార్త్ వెస్ట్' చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు కృష్ణారావు, బి. చిన్నారావు, హుస్సేన్, అనకాపల్లి ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి అజయ్ కుమార్, సత్యవతి, ప్రభుదాస్, చాట్ల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణతో ట్రాఫిక్ సమస్యలు



జగ్గారావు బ్రిడ్జి వద్ద రోడ్డును ఆక్రమించిన సామగ్రి

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో జగ్గారావు బ్రిడ్జి వద్ద రహదారి ఆక్రమణలకు గురవడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జాతీయ రహదారి నుంచి దొండపర్తి వెళ్లడానికి ప్రధాన మార్గం కావడంతో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీ ఏర్పడుతోంది. అటువంటి మార్గంలో జగ్గారావు బ్రిడ్జి దరి ముస్లింల శ్మశానవాటిక వద్ద రోడ్డు కొంత మేర వెడల్పు తగ్గి ఉంటుంది. దానికి తోడు తోపుడు, పకోడి బళ్లు, చిరు వ్యాపారులు రహదారిని ఆక్రమించడంతో మార్గం మరింత కుచించుకుపోయి తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంత ఇరుకు రోడ్డులో బ్రిడ్జిపై నిర్వహిస్తున్న పకోడీ బండి, శ్మశానవాటిక గోడకు ఆనుకుని చిరు వ్యాపారాలు ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది స్పందించి జగ్గారావు బ్రిడ్జి వద్ద ఆక్రమణలు తొలగించి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



జగ్గారావు బ్రిడ్జిపై నిర్వహిస్తున్న పకోడి బండి

విద్యుత్ సరఫరాలో నష్టాల నివారణకు చర్యలు



భూగర్భ కేబుళ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్: విద్యుత్ సరఫరాలో నష్టాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ జోన్–2, ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో ఏర్పాటు చేయనున్న 33కేవీ, 11కేవీ భూగర్భ కేబుల్స్ నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ కేబుల్స్ వల్ల వరదలు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి విద్యుత్ వ్యవస్థను రక్షించవచ్చని, తద్వారా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని చెప్పారు. ఇంటిపై సౌరశక్తి ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుని ఉచితంగా విద్యుత్ పొందడానికి ప్రజలు పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని వివరించారు. దీని వల్ల మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి ఆదాయం కూడా పొందవచ్చని తెలిపారు. సాంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి, పర్యావరణహిత విద్యుత్‌ను ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, బీజేపీ, టీడీపీ నాయకులు, ఏపీఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పుతో అవస్థలు



నేతాజీ వంతెన కిందన తగలబడుతున్న చెత్తచెదారం

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు పరిధిలోని కంచరపాలెం, నేతాజీ ఫ్లైఓవర్ కింద ఉన్న గాంధీనగర్ ప్రాంతంలో నిత్యం చెత్త పొగలు కమ్ముకుంటున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది కాలనీలో సేకరించిన చెత్తను వంతెన కింద ఉన్న ఆర్పీపేట పైడిమాంబ ఆలయం వద్ద వేస్తున్నారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెడుతుండటంతో గంటల తరబడి మంటలు, పొగలు వ్యాపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన కింద ఉన్న రైల్వే రక్షణ గోడల వద్ద కేబుల్ వైర్ల నుంచి రాగి, కాపర్ తీగలను దొంగలించేందుకు కొందరు ఇలా నిప్పు పెడుతున్నారని పారిశుద్ధ్య సిబ్బంది చెబుతున్నారు. అయితే పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తే ఈ సమస్య తలెత్తదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై జోన్–5 పబ్లిక్ హెల్త్ అధికారులు దృష్టి సారించి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గాంధీనగర్ ప్రజలు కోరుతున్నారు.

అనధికార నిర్మాణాలు



శాంతిపురంలో కిన్నెర మెస్ వెనుక బహుళ అంతస్తుపై నిర్మించిన పెంట్‌హౌస్



అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద డ్రెయిన్‌పై నిర్మించిన స్టెయిర్ కేస్

సీతంపేట: కూటమి నాయకుల అండదండలతో వార్డుల్లో అనధికార నిర్మాణాలు వెలుస్తున్నాయి. జీవీఎంసీ పరిధిలో పెంట్‌హౌస్‌లకు అనుమతి లేనప్పటికీ 25వ వార్డు శాంతిపురంలో కిన్నెర మెస్ వెనుక 50–92–6 డోర్ నంబర్‌లో స్టిల్ట్ జీ ప్లస్4కు అనుమతి తీసుకుని బహుళ అంతస్తుల భవంతి నిర్మాణం చేపట్టారు. పై అంతస్తులో అదనంగా అనుమతి లేకుండా పెంట్‌హౌస్ నిర్మించారు. భవన యజమానికి కూటమి ఎమ్మెల్యే సిఫార్సు ఉండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులు అనధికార పెంట్‌హౌస్ జోలికి పోవడం లేదు. కూటమి నాయకుల అండదండలు ఉంటే పెంట్‌హౌస్‌లు కూడా యథేచ్ఛగా కట్టుకోవచ్చని స్థానికులు గుసగుసలాడుతున్నారు. 43వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో జగ్గారావు బ్రిడ్జి వద్ద ముస్లింల శ్మశానవాటికకు ఆనుకొన్ని ఉన్న మటన్ సెంటర్ పైభాగంలో ఇటీవల మరో అంతస్తు నిర్మించారు. మొదటి అంతస్తు ముందు భాగంలో నిర్మించిన షాపునకు వెళ్లడానికి జీవీఎంసీ డ్రెయిన్‌ను ఆక్రమించి దానిపై స్టెయిర్ కేస్ నిర్మించారు. దీంతోపాటు కమర్షియల్ ప్లాన్ పైన నిర్మించిన మొదటి అంతస్తులో షాపు నిర్మించారని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా సచివాలయం సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు వాన





అక్కయ్యపాలెంలో జోరుగా కురుస్తున్న వర్షం

సీతంపేట: నెల రోజుల పాటు వేసవిని మించిన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలకు బుధవారం కురిసిన వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. ఈ ఏడాది ముందుగానే వర్షాలు మొదలయ్యాయని ఆనందించినప్పటికీ, జూలై ప్రారంభం నుంచి ఎండలు మళ్లీ తీవ్రంగా మారాయి. దాదాపు అరగంట పాటు జోరుగా కురిసిన ఈ వర్షానికి వాతావరణం చల్లబడింది. దీంతో నగరవాసులు ఎండల నుంచి ఉపశమనం పొందారు. అకస్మాత్తుగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా సీతంపేట, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో పనుల మీద బయటకు వెళ్లిన ప్రజలు వర్షంలో తడవకుండా ఆశ్రయం కోసం పరుగులు తీశారు.

వాల్తేర్ కేవీలో ముగిసిన శిక్షణా తరగతులు



ముగింపు సందర్భంగా నిర్వహించిన సర్వమత ప్రార్థనలలో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయ (వాల్తేర్)లో సోమవారం ప్రారంభమైన హీరక్ పంక్, గోల్డెన్ ఏరో టెస్టింగ్ శిక్షణ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఈ శిబిరంలో అమరావతి, హైదరాబాద్ రీజియన్ల నుంచి 32 కేంద్రీయ విద్యాలయాలకు చెందిన సుమారు 220 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు నాట్స్ (ముడి వేయడం), దాని ప్రాముఖ్యత, కిట్ ఇన్‌స్పెక్షన్, యూనిఫామ్ తనిఖీ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం సర్వమత ప్రార్థనలు, జెండా అవనతం కార్యక్రమాలతో శిబిరాన్ని ముగించారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ, సమయపాలన, స్వచ్ఛత, సహకారం వంటి విలువలను పెంపొందించారు. శిబిరంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బూర్ సింగ్ మీనా, క్యాంపు లీడర్ జ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు వి.ఎం. శైలజ, సిబ్బంది జి. వాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.